# కాణిపాకం వినాయకుడి సాక్షిగా!...

రంగి మనసు మనసులో లేదు!

ఎంత ప్రయత్నించి పట్టుకొన్నా అది పరి పరి విధాలా పోతూనే ఉంది.

"పొద్దు నడిమిట్టకొచ్చీ రాకతాళకే నిలువెత్తు మోపు దెచ్చి గుడిసింటి గోడకు నిలేసే మొగలాయి ఇంట్లో మొగోడు. పొద్దు తిరగతా ఉండాది. కెలికిన సంకటి ఎండిపోతా ఉండాది. 'ఆకిలమ్మా ఆకిలి' అంటా ఏడ్చి ఏడ్చి పాపం చిన్న పిల్ల రొండు దెబ్బలు తిని ఎట్లపొయ్యిందో పొయ్యింది. ఈ మణిసి ఇంకా రాలేదే? ఏమయ్ పొయ్ నాడబ్బా? కావిలోళ్ల కంట్లో గానీ పణ్ణాడా? పడుంటే వాళ్లేం చేస్తారు? కత్తి పెరుక్కుంటారు. కాదు గీదంటే కేసు పెడ్తానంటారు. అయిదో పదో చేతిలో పడ్తే అలాగ్గా వొదిలేస్తారు. అట్టా మాదిరి అయ్యుంటే గూడా మణిసి ఇయ్యరవకే కొంప జేరుకొని ఉండాల గదా? ఏమయిందో ఏం పాడోనే? ఆ అడువుల్లో ఏపుట్లో ఏపాముంటిందో? ఏ పొదలో ఏది మాటేసుకోనుంటిందో? చూస్తా కూసుంటే కట్టి కంపా కూడేసుకుండే దానికవితిందా? అట్టా జరగరాన్ది ఏదైనా జరగి పొయ్యుంటే ఇంక ఈ కొంప గెతేం కావాల్రా బగమంతుడా?"

రంగి ఈ ఆలోచనతో తట్టుకోలేక పోయింది. ఉలిక్కి పడినట్టుగా పైకి లేచింది. లేస్తూ ఉంటే వొడిలో పైట జారి నేలమీద పడింది. ఆ పైటను అందుకోవడానికి వంగింది. మెడలో వేలాడుతున్న మంగళసూత్రం కంటబడింది. కుడిచేత్తో మంగళసూత్రాన్ని పట్టుకొనింది. ఎడమ చేత్తో పైట సర్దుకుంటూ మంగళ సూత్రాన్ని కండ్ల కద్దుకొనింది. అద్దుకొంటూనే వీధిలోకి నడిచింది.

అక్కడ నిలబడి మంగళసూత్రాన్ని రెండు చేతుల్లో పెట్టుకొని ఒకసారి రెండు కండ్లకు అద్దుకొనింది. పైట చాటున దాచుకొనింది. తలపైకెత్తింది. రెప్పార్చకుండా కాలిబాటవైపు చూసింది. రెప్పలు వాలిపోయాయి. తల వాలిపోయింది. రంగి అడుగులో అడుగ్గా గుడిసెలోకి నడిచింది.

ఆమె తాపత్రయం నిమిషాలతో పోటీ పడుతూ ఉంది. ఎదురు చూసి ఎదురు

చూసి మనసు విసిగిపోయింది. ఇంట్లోకి, వీధిలోకి తిరిగి తిరిగి కాళ్ళు కుక్కలు పీకినట్లు పీకుతున్నాయి. 'ఇంక నావల్ల గాదురా బగమంతుడా' అంటూ కూలబడింది.

కట్టె గుడిసెలో మనసు మగని చుట్టూ?...

'ఏం బతుకులో పాడు బతుకులు. అట్టా చచ్చినట్టులే. ఇట్టా బతికినట్టులే. దిన దిన గెండెం నూరేండ్లాయుస్సుగా పోరకలాడాలంటే అది అయ్యే పనేనా? ప్చ్! అయినా ఇదేమి యిపరీతకాలమో ఏంపాడో! చేతికంత మట్టిగాకుండా బతికేవాళ్లు బతికిపోతా ఉంటే, కన్నగసాట్లు పడతా ఉంటే కూడా ఈ జానెడు కడుపు పూడనంటా ఉండాదే'.

గోడకు చేరగిలబడి ఆలోచిస్తా రంగి అలానే నిద్రలోకి జారుకొనింది.

"ఆ పొద్దు వాళ్లు నన్ను నమ్మించి నా వేళ్లతో నా కండ్లనే పొడవలా? ఈ పొద్దు? వాళ్లేళ్లతో వాళ్ల కండ్లే!...అంతే! పెట్టాల్సించోట అగ్గి పెట్టేసినా. ఇంక పేలాల్సిన చోట్లో పేలి పోతింది." ఒక్క ఊపులో గుడిసింట్లో దూరిన మాకడు కస్సుబుస్సు మంటున్నాడు.

రంగి ఉలిక్కిపడి లేచింది.

"ఈ దెబ్బతో హ్హాహ్హాహ్హా! వాళ్లబండారం బయిట పడిపోవాల. నలుగుర్లో తలెత్తుకోని తిరగలేకుండా మగ్గి మగ్గి చావాల. అప్పుడు నా కడుపుమంట చల్లారాల" అని తనలో తానే గొణుక్కొంటూ మాకడు చేతిలో కత్తిని చూరులో దోపాడు. తలగుడ్డ విప్పి విదిలించి దండెం మీద వేశాడు. కాళ్లు చేతులు కడుక్కోవడానికి పెరట్లోకి నడిచాడు. మగని మాటలు అర్థం కాకుండా అయోమయంగా అతడివైపు చూస్తూ కీ ఇచ్చిన మర బొమ్మలా గుడిసింటి వాకిట్లోకి వచ్చింది రంగి.

మాకడు ముంతలో నీళ్లు ముంచుకొన్నాడు. మొగం కడుక్కొన్నాడు. కాళ్లు చేతులూ కడుక్కొంటున్నాడు. రంగి గుడిసింటికి ఇటు పక్క అటు పక్క కూడా చూసింది. కట్టెల మోపు కంట పడకపొయ్యే సరికి కనుబొమ ముడి పడింది.

"చూడు చూడే!..చూడు! తొంగి తొంగి చూడే. మొగుడితో నీకేం పనే? మోపుతోనే గదా." మొలకు కట్టుకున్న పంచతోనే వొంగి మొగం తుడుచుకుంటూ మాకడు దెప్పిపొడిచాడు.

ఆ ఎత్తి పొడుపుతో రంగి మనసు బాధగా మూలిగింది. అంతవరకు తాను పడిన మథన మంట ముందు మైనంలా కరిగి పోయింది. రెప్పార్చకుండా మాకణ్ణి చూస్తూ నిలబడింది.

"ఇంట్లో మొగోడు యాడ చస్తే నీకేమే? యాడ చదరమైతే నీకేమే? నీక్కావలసింది కట్టెల మోపు. అంతేగదా!"

"ఏందయ్యో? నీ ఇష్టం వచ్చినట్టు నోరు పారేసుకుంటా ఉండావే. కోళ్లను నిద్దర లేపి కొంప వొదిలి పాయ్‌నోడివి. మల్లా అవ్వి వొడిగే యేళకాడ చేతులూగించుకుంటా కొంపకొస్తా ఉండావ్. సంకటి కెలికి చట్లో పెట్టేసి పొద్దు నడిమిట్టకొచ్చింది మొదులకోని

నేను పణ్ణె తాపేత్రం ఆ పరమాత్తుడికే ఎరిక. అది నీకేడ అర్తమయితిందిలే? అయ్యేటట్టుగా ఉంటే మీరు మొగోళ్లు ఎట్టవతార్లే? అది సరేగానీ వాళ్లెళ్లతో వాళ్ల కండ్లేంది?...వాళ్ల బండారం బయిటపడి పొయ్యేదేంది? ఏందయ్యో ఈ పొద్దు నీకత నాకేమీ అర్తం కానంటా ఉండాదే?"

"ఉడుంకెందుకు ఊళ్లో పెత్తనం అన్నెట్టుగా ఆడదానికెందుకే అడిగే అతికారం? ఆసరా తీసే యవ్వారం. తెచ్చేస్తే వండి పెట్టాల. అంత తిని కొంపలో పడుండాల."

"కొంపలో పడుండకుండా ఇప్పుడు నేనేం కోటలకు పేటలకు పరిగిత్తా ఉండానా? ఈదలమింద బడి ఊరేగతా ఉండానా? కండ్లలో నిద్దర కండ్లల్లో ఉండంగానే కాలు ఎలపెరుక్కోని పొయ్‌నాడే? ఆఅడువుల్లో ఏ పుట్టలో ఏ పురుగుంటిందో? ఏ పొదలో ఏది మాటేసుంటిందో? అని నేను మల్ల గుల్లాలు పడి చస్తా ఉంటే..."

"అవునుగానీ...నా మొకానేమన్నా అంత సంకటో సలిబిండో కొట్టే పని ఉండాదా, లేదా?"

"అయ్యో నారాత! మామొకాన కొట్టుకుందామనే గదా పొద్దు నడిమిట్టన ఉండంగానే సంకటి కెలికి పెట్టింది. ఈగిలు ముసర్తా ఉంటే చూస్తా కూసోనుండేది." అని యాష్టపోతూనే రంగి మూకుట్లో ముద్ద సంకటి వేసింది. ఆ ముద్దమీద ఒక్క అబక పుల్లగుర పోసింది. ముంతతో నీళ్లుముంచి ఆ మూకుడు పక్కన్నే పెట్టింది.

మాకడు మూకుడు ముందు కూర్చున్నాడు. చేరడులోకి ముంతలో నీళ్లు వొంచుకొన్నాడు. అరచేతిని తడుపుకొన్నాడు. సంకటి ముద్దను తుంచి పిడచ చేస్తున్నాడు.

"ఆకిలమ్మా! ఆకిలి" అని ఏడిస్తే గూడా పిల్లదాని కంత సంకటి పెట్టకుండా పోతి. పాపిష్టిదాన్ని. ఏడ్చి ఏడ్చి అది యాడబడి నిద్దరపోతా ఉండాదో ఏంపాడో? పొయ్ చూసుకోని వస్తా. నువ్వు తింటా ఉండు. ముద్ద సంకటి తినేకుందికే వచ్చేస్తాలే. రాకుండాబోతే చట్లో ఉండే సంకటి ఒక ముద్దేసుకో. అద్దో కూర చట్లో ఉండాది పుల్లగూర. అబకతో ఎత్తి అంతేసుకో. ఆడ ఎవిరిమిందనో కోపం తిండి మింద చూపించబాక" అంటూ రంగి మగని మాట కోసం ఎదురు చూడకుండా బయలుదేరింది.

చేతిలో పిడచ చేతిలోనే ఉంది. మాకడు ఒక్కసారి తలపైకెత్తి రంగివైపు చూశాడు. అదేమీ పట్టించుకోకుండా రంగి వడిశెల రాయిలా ముందుకు దూసుకోని పోతూ ఉంది. మాకడి చూపు మళ్లీ సంకటి మీదికి మళ్లింది. పిడచ పిడచగా తుంచి పుల్లకూరలో అద్ది 'గుటక్ గుటక్' మని మింగుతున్నాడు.

'వాళ్లెళ్లతో వాళ్ల కండ్లా?...బండారం బయిట పడిపోతిందా? ఏందో ఈమొగోడి కత. అర్తం కాకుండా ఉండాదే' అని ఆలోచించుకుంటా కూతుర్ని వెదుక్కొంటూ ఊరి మీద పడింది రంగి.

పొద్దుగూట్లో పడింది.

* * * *

"మాకా!...ఒరే మాకా!!"

నడిమిట్ట మీద సూర్యుడు అగ్గిపడి పోతున్నాడు. గుడిసింటి కెదురుగా చింతచెట్టు కింద నిలబడిన అంకిరెడ్డి కండ్లల్లో అగ్గి కురుస్తూ ఉంది. పూనకం పూనినట్టు మనిషి వెనక్కు, ముందుకూ ఊగిపోతున్నాడు. అతని నోటి నుంచి వెలువడిన పిలుపు కొత్త మొగాన్ని చూసిన కుక్క అరుపులా ఉంది.

మాకడు అంతకు ముందే అడవి నించి తిరిగి వచ్చాడు. మెడలు విరిగేటట్టు మోసి తెచ్చిన కట్టెలమోపును గుడిసింటి గోడకు ఆనించాడు. మెడలు విరుచుకొన్నాడు. తలమీదికి చుట్టగా మారిన చవకాన్ని చేతిలోకి తీసుకొన్నాడు. విప్పి విదిలించాడు. భుజాన వేసుకొంటూ పెరట్లోకి నడిచాడు. ముంతలో నీళ్లు ముంచుకొని కాళ్లు చేతులు, మొగం కడుక్కొన్నాడు. భుజాన చవకంతో మొగం తుడుచుకొంటూ గుడిసింట్లో అడుగు పెట్టాడు. అప్పటికే రంగి మూకుట్లో వేసిన ముద్ద సంకటి ఆవిర్లు కక్కుతూ ఉంది. తినడానికి కూర్చుంటున్నాడు. అంతలోనే అంకిరెడ్డి పిలుపు చెవిని పడింది.

కడుపులో చల్ల కదలకుండా నీడ పాటున నిమ్మతిగా బతికే మనిషి అంకిరెడ్డి. అటువంటి మనిషి మాడు పగలగొట్టే ఎండలో తన ఇంటి ముందుకు రావడం...గుడిసిల్లు ఎగిరిపొయ్యేటట్టు అరవడం-మాకడు ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు.

"మాకా!...ఒరే...రారా! ...రారా బయటికి!"

మళ్ళీ అంకిరెడ్డి పిలుపు.

మాకడి గుండె గభీమనింది. దినాలు తిరగకముందే కథ పాకాన పతుతున్నందుకు ఒక పక్క ఆనందంగా ఉన్నా ఇంకొక పక్క బెరుకు. అయినా ఏం ప్రయోజనం? ఆవేశంలో ముందు వెనుకలు ఆలోచించకుండా అనుకున్నంత పని చేశాడు. రోటిలో తల దూర్చి రోకటి పోటుకి వెరిస్తే?...అందుకే తెంపుగా పైకి లేచాడు. దర్జాగా చింతమాని కిందికి నడిచాడు. అంకిరెడ్డి ఎదురుగా నిలబడ్డాడు.

బాగా పండిన కొఱ్ఱ కంకులా వొంగి మడి చేతులు కట్టుకొని అడుగు మీద అడుగ్గా భయం భయంగా మాకడు తన ముందుకు వస్తాడనుకున్న అంకిరెడ్డికి ఆశా భంగమే అయింది. వాడు వచ్చిన వైనంతో అంకిరెడ్డికి ఆశ్చర్యం కలిగింది. అయినా బయట పడకుండా రెప్పార్చకుండా వాడి మీద నిప్పులు కురిపిస్తున్నాడు.

"పిలిచింది ఎందుకో చెప్పు రెడ్డయ్యా?"

అంకిరెడ్డి చూపుల్లో మార్పులేదు. ఊపులో కూడా మార్పు లేదు.

"ఎందుకు రెడ్డయ్యా అట్టా చూస్తా ఉండావే? చూపుల్తోనే కాల్చేసే దానికి నేనేం కొంగను కాదయ్యో! చెప్పు చెప్పు. పిలిచింది ఎందుకో చెప్పు?"

'ఒరే! నోరెత్తలేకుండా గిలగిల్లాడి చస్తాడనుకుంటే?...కత శానా శానా దూరం పోతా ఉండాదే?...ఇట్లయితే ఇంక లాబంలే. తాడో పేడో తేల్చుకోవాల్సిందే'అని ఒక నిర్ణయానికొచ్చాడు

అంకిరెడ్డి. నిర్ణయానికి రావడంతో తెపరాయించాడు- చింతమాని మీది కాకులు ఎగిరి పోయేటట్టు.

మాకడు చింతమానికి పట్టిన కాపును గమనిస్తున్నాడు.

అంకిరెడ్డికి అరికాలి మంట ఉచ్చికెక్కింది.

"ఎంత పని చేసినావురా!"

"రెడ్డయ్యా! ఇష్టం వచ్చినట్టు నోరు పారేసుకోబాక. ఎవరో ఏందో చేసేసినట్టు ఎగిరెగిరి పడ్తా ఉండావే? ఆ అంత పని చేసిందెవురు?"

"ఏం కూసినావురా?"

"నేనేమో మరేదగానే మాట్లాడతా ఉండా. నోటికొచ్చినట్టుకూస్తా ఉండాది నువ్వే."

"ఒరే తక్కవ జాతి నా కొడకా? ఎంత కాడికొచ్చినావురా?"

"నేనెందు కవతానయ్యా తక్కవ జాతోణ్ణి? తప్పుడు కూతలు కూసే వాళ్లు... తప్పుడాట్లు ఆడేవాళ్లు... తక్కవ జాతోళ్లవతారుగానీ..."

"రే! ఏందిరా నువ్వనింది. ఇంకొకసారన్రా!"

"ఒక్క సారేంకర్మ!...వొగిటికి పదిసార్లంటా!"

"నేను తక్కవ పన్లు చేసినానా?"

"చేసినావోలేదో ఒకసారి గుండెకాయి మింద చెయ్యిపెట్టి ఆలోచించుకోరాదా?"

"ఒరేయ్! నాకేం కూటికి లేదా, గుడ్డకు లేదా రా? తక్కవ పన్లు చేసేదానికి?"

"రెడ్డయ్యా! తమరికి తెలవదనికాదు. కూటికి, గుడ్డకు లేనోళ్లే మాటమింద పడి చచ్చేది. మానానికి హీనానికి ఎర్సేది. ఆ మాటకొస్తే కూటికి, గుడ్డకు కలిగినోళ్లే కోట్లకు పడిగెత్తాలని నానా అడ్డ కూళ్లూ కుడిసేది. అయినా అర్సేతికి అద్దమెందుకయ్యా? మనం చేసింది మనకు తెలస్తానే ఉండ్లా?"

"నేనేం చేసినాన్రా తప్పుడు యదవా?"

"తప్పుడు యదవా!...ఎవుడయ్యా? తప్పుడు పన్లు చేసేవోడు. పోనీ! నువ్వేమీ చెయ్‌లేదా? గోచిపేత పెట్టకోని నీ కొంపలో బర్రెగొడ్లు మేపితి. నిక్కరేసుకోని అవుల ఎంట అడివికి పోతి. నాలుగు మూర్ల తుండుగుడ్డ మొలకు చుట్టుకోమని యిసిరి నా మొకాన పారేసి మూడు బావుల కింద సేద్యం వొంటి చేతికప్పగిస్తివి. నా కండలు పిండితి. నా రగతాన్ని చెమటగా మారిస్తి. నీ గాదెలు నింపితి. నువ్వేమో మేడ మీద మేడ కట్టుకుంటివి. నీవోళ్లు నీ చేతికిందికి ఎదిగేకుందికి ఎనుకూ ముందు చూడకుండా నన్ను మెడబట్టి బయటకి గెంటేస్తివి. 'పోరా పో! పొయ్ దిక్కుండే కోరట్లో దావా ఏసుకో పోరా!' అంటివి. దావా ఏసుకుండే సెగితే నాకు ఉణ్ణుంటేనా? హు! ఎందుకులే? అదట్టా పోనీ! రగతం పంచుకోని పుట్టిన నీ ఇంటి ఆడపడుచు ఆరు సవరాల నాలుగుపేట బంగారు గొలుసు తెచ్చి నీ చేతికిచ్చె. చేతులు పట్టుకోని నీ కొడుక్కు తన కూతుర్ను చేసుకోమనె. సరే నంటివి.

చేతిలో చెయ్యేస్తివి. నాకండ్లారా నేను చూస్తినే. అయినా మాటమింద నిలబడ్తివా? కొడుకు ఒప్పుకోలేదంటివి. పోనీ! ఆమెతెచ్చిచ్చిన గొలుసు ఆమెకిచ్చేయాల గదా. నోరు తెర్సి అడిగితే ఏమంటివి? ఏ గొలుసంటా అడ్డం తిరిగితివి."

"ఎవుడమ్మా మొగుడి సొత్తురా ఆ గొలుసు?"

"బలే చెప్పినావు రెడ్డయ్యా! నిప్పటుమంటిది గదా నిజం. అవుగదా మరి! ఎవుడమ్మా మొగుడి సొత్తు ఆగొలుసు? అది తేల్చేదానికే గదా మద్దిస్తం పెట్టానంటా ఉండారు. పెట్తే అణ్ణే తేలిపోతుంది గద అది ఎవుడబ్బ సొత్తో? దానికి ఇప్పుడెందుకయ్యా ఈ కుంటి మద్దిస్తం?నువ్వు పద పద!"

అంకిరెడ్డి మాటకు ఎదురు చూడకుండా మాకడు గిరక్కున వెనక్కు తిరిగాడు. ఒక్క ఊపులో గుడిసింటి వైపు నడుస్తున్నాడు. అంతవరకు నీడనిచ్చిన చింతచెట్టే ఫెళ ఫెళా విరిగి నెత్తిన పడినట్లనిపించింది అంకిరెడ్డికి. ఒక్క క్షణం అక్కడ నిలబడలేక పోయాడు. తల పంకిస్తూ మీసం మెలేస్తూ గుడిసింటి వైపు తీక్షణంగా ఒక్క చూపు చూశాడు. నిజానికి భుజాన్నిస్తున్నట్టు ఆ చుట్టుగుడిసె ఉన్నట్లుండి అంకిరెడ్డి కంటికి అంతై ఇంతై ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోతున్నట్లనిపించింది. అంకిరెడ్డి తలవాలిపోయింది. గుండె బరువెక్కింది. కోపం ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా మారింది. అడుగు మీద అడుగ్గా ఊళ్లోకి నడుస్తున్నాడు.

మాకడు మూకుడు ముందు కూర్చున్నాడు.

"ఏంది మామా రెడ్డయ్యతో..."

"ఏందైతే నీకెందుకే?"

"మనబోటి పేదోళ్లు కొండల్తో డీ కొంటే అవి కొండలు మామా! కదలవు. మెదలవు. వాటి మద్దెబడి మనమే నలిగి చస్తాం."

"కదల్తాయో కదలవో, ఎవురు చస్తారో చూస్తా ఉండే!"

"నువ్వు ఉత్త బ్రెమలో పడ్తా ఉండావు మామా!"

"నువ్వు నోరు మూస్తావా. మూకుట్లో సంకటి ముద్దెత్తి మొకాన కొట్టమంటావా?"

ఆ మాటతో రంగి నోరు మూతబడింది. ముంతతో నీళ్లు ముంచి మూకుడు పక్కన పెట్టింది. గుడిసింట్లో నిలువు కొయ్యకు ఆనుకొనింది. జరగబోయే పరిణామాలను బొమ్మ కట్టుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ ఉంది. మాకడు సంకటి తినడంలో నిమగ్నుడయ్యాడు.

ప్రతి వాడికి ఒక అంతరాత్మ ఉంటుంది. అది ఎప్పుడో ఒకప్పుడు మేలుకొంటుంది.

అంకిరెడ్డి అంతరాత్మ మేలుకొనింది.

"ఒక తప్పు చేశావు. దానిని కప్పి పుచ్చుకోవడానికి ఇంకొక తప్పు చేస్తున్నావు."

"తప్పు చేసింది నేను కాదు."

"ఎవరు చేసినా తప్పు తప్పే గదా! మీ అప్పచెల్లె తప్పు చేసింది. దానికి నువ్వు సహకరించావు."

"మా అప్ప చెల్లెలు తప్పు చేసిందని నిజంగా నాకు తెలియదు."

"ఆ మాట నిజమే! అయితే ఆమె నాలుగు పేట బంగారు గొలుసు తెచ్చి నీ చేతికి ఇచ్చినప్పుడు అది దొంగసొత్తని తెలియదు. ఆ తర్వాత తెలిసింది."

"అవును."

"కదా. ఆ సొత్తు కలవాళ్ళు ఎవరో కాదు. మీకు దగ్గర బంధువులే. మీచెల్లెలి పక్కింటివాళ్ళే. ఆ ఇంటి కోడలు ముచ్చటపడింది. తన కొడుకు అయిదారేండ్ల పసిబిడ్డ. చూడముచ్చటగా ఉంటాడు. ముచ్చటపడి వాడికి చిన్ని కృష్ణుడి వేషం వేసింది. తనమెడలో ఉన్న నాలుగు పేట బంగారు గొలుసు తీసి వాడి మెడలో వేసింది. వాడు ఆనందంతో అటు, ఇటు తిరుగుతూ మీ చెల్లెలి ఇంటికి పోయాడు. మీ చెల్లెలి కన్ను ఆ గొలుసు మీద పడింది. ఆ పిల్లవాణ్ణి చేరదీసింది. తినడానికి వాడి చేతికి ఏదో ఇచ్చింది. ఎత్తుకుని ముద్దులాడుతూ మురిపించి /మరపించింది. గొలుసు కొట్టేసింది. లావుమీద వంపు తెలియదు కదా? సందేహానికి తావు లేకపోయింది. ఈ వాస్తవం ఆ తర్వాత తర్వాత తెలిసింది."

"తెలిసి ఏం ప్రయోజనం?"

"నువ్వు యోగ్యుడైతే వాళ్ల సొత్తు వాళ్లకే ఇచ్చేసేవాడివి."

"ఆ పని నేను చేస్తే నాచెల్లిలి పరువు ఏం కావాలి?"

"ఇప్పుడు నీ పరువు? ఇదంతా మాకడి వల్లనే కదా జరిగింది."

"మాకడికి నువ్వు అన్యాయం చేశావు."

"నేనేం వాడి బూములు, బావులు, వస్తు వాహనాలు దోచుకొన్నానా?"

"ఇవన్నీ వాడికే ఉంటే వాడెందుకు నీఇంటి సేద్యగాడవుతాడు? వాడి కష్టాన్ని నువ్వు దోచుకొన్నావు."

"వాడు చేసిన కష్టానికి నేనుపెట్టిన కూడూ గుడ్డకుసరిపోలేదా?"

"అదేనా నువ్వు వాడికిచ్చిన మాట?"

"................"

"మాట తప్పినవాడివి. నువ్వేం మాట్లాడతావు. ఆ గొలుసు నీ చేతికి వచ్చినప్పుడు వాడు నీ ఇంట్లో ఉన్నాడు. దానికి వాడు సాక్షి. ఆ తర్వాత నువ్వు నీ మేనకోడలు సంబంధాన్ని కాదని గొలుసు ఇవ్వలేదని అడ్డం తిరిగిన దానికి ఊరంతా సాక్షి. మాకడు ప్రతీకారం తీర్చుకోవడానికి వాడికొక మంచి అవకాశం దొరికింది. అవకాశం దొరికితే ఎవడు చేతులు ముడుచుకొని కూర్చుంటాడు? అవకాశం దొరికినప్పుడు కేవలం ఆరు సవరాల బంగారానికే నీ బుద్ధి గడ్డి తినింది కదా? అలాంటప్పుడు మాకడు చేసింది తప్పని ఎలా అంటావ్?"

"తప్పుకాదు, అయినా ఈ ముప్పు నుంచి బయటపడాలి కదా"

"ఇంకెలా బయటపడతావ్? పదిమందిలో పడిన పాము చావదంటారు కానీ,

నువ్వు మనిషివి''

"ఆ పదిమందిలో అంకిరెడ్డి ఒకడా? కాబోడు. అదే అంకిరెడ్డి ప్రత్యేకత''

ఆ భావనతో అంకిరెడ్డికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది.

తెంపుగా ముందుకు నడుస్తున్నాడు.

రెండుముద్దల సంకటి రెండునిమిషాల్లో లాగించినట్లు లాగించి మూకడు ఆ మూకుట్లోనే చేతులు కడుక్కున్నాడు.

ఊరు మాటు మణుగుతున్న వేళ!

ఆ వేళప్పుడు రెండు చెంబుల వేడినీళ్లతో ఒళ్లు కడుక్కొని, ఉడుకుడుగ్గా అంత నోట్లో వేసుకొని, ఆదరా బాదరా పండిన చేనుల కావలికి కొందరు బయలు దేరే వాళ్లు. కరంటు ఎప్పుడువస్తుందో ఎప్పుడుపోతుందో తెలియదు. వస్తే మడికయ్యలకు, తోటలకు తడివేసుకోవచ్చని బావులదగ్గర శవజాగరణ చెయ్యడానికి కొందరు బయలుదేరే వాళ్లు. కానీ ఆపూటమాత్రం నిక్కుతూనీలుగుతూ స్నానపానాదులు ముగించుకొని ఊరి నడిబొడ్డులో రాగిమానికింద రచ్చ బండ దగ్గరికిపెండ్లి నడకలు నడిచారు.

ఆ పొద్దు ఊళ్లో మద్దిస్తం!

ఇంటికొక్క పెద్ద తల తప్పకుండా మద్దిస్తానికి రావాలని మడివేలు అదేపనిగా ఇల్లిల్లు తిరిగి చెప్పాడు.

మద్దిస్తం అంటే 'ముందు మాకు పొయ్యండి వసంతం' అనేవాళ్లు మాత్రం అప్పటికే రచ్చబండ వద్ద చేరారు. రచ్చబండ మీద తీరుబాటుగా కూర్చొని ఆకూ వక్కా నమిలేవాళ్ళు నములుతూ బీడీలు కాల్చే వాళ్లు కాల్చుతూ... ఆ రాత్రి జరగబొయ్యే మద్దిస్తంపై ఊహాగానాలు చేసుకొంటున్నారు.

ఆ మధ్యాహ్నానికే పొరుగూరు నుంచి ఊరు చేరుకున్న అంకిరెడ్డి కాలికి బలపం కట్టుకొని ఇల్లిల్లు తిరిగాడు. తన తప్పు ఏమీ లేదంటూ నంగేడ్పులతో నమ్మించడానికి నానా తిప్పలు పడ్డాడు. ఎదుటపడిన ప్రతి వ్యక్తి చేతులు పట్టుకొని 'ఇదేమన్నా నాయంగా ఉండాదా? ఆ తక్కవ జాతోడి మాటలు నమ్మి నన్ను రచ్చబండ కాడికీడస్తారా? పైన మండే వాడొకడుండ్లా? నాకడుపుమంట వాళ్లకు ఎదక్కుండా పోతిందా?' అంటూ ఏడుపు మొగం పెట్టాడు. ఎవరికి తోచినట్టు వాళ్ళు తలకొక విధంగా ఓదార్పు మాటలు చెబుతుంటే మద్దిస్తంలో గెలుపు తననే వరించినట్లు లేని ధైర్యాన్ని తెచ్చుకొన్నాడు. ఆ ధైర్యంతోనే మొగం చెల్లకపాయ్‌నా ధైర్యంగా చెల్లెమ్మ గడప తొక్కాడు.

"ఎప్పుడన్నా వచ్చింది'' అంటూ గడప దగ్గరికే ఎదురు రావాల్సిన చెల్లెమ్మ చూసీ చూడనట్లు ముభావంగా ఉండే సరికి అంకిరెడ్డి గుండెల్లో రాయి పడింది. అయినా మనిషి తెపరాయించుకొన్నాడు. ఆమె రెండు చేతులు పట్టుకొన్నాడు. ఆ మొగాన్ని చూడలేనట్లుగా ఆమె తలవంచుకొనింది.

"చెల్లెమ్మా! ఇవ్వి చేతులు గాదు. గొప్పమనుసుచేసి నా మాటినిపించుకో. జరిగిందేదో జరిగి పొయ్యింది. అదంతా మణుసులో పెట్టుకోని ఇప్పుడు తవ్వి తలకెత్తుకుంటే వొరిగి మిట్టన పడబొయ్యేదేముండాది? నువ్వు గట్టిగా నిలబడక పోతే ఇద్దరి బతుకులు ఈదల పాలవతాయి."

ఒక్కసారి తలపైకెత్తి అన్న మొగంలోకి నిశితంగా చూసింది చెల్లెమ్మ!

"బుద్ధి గెడ్డితినింది. ఇదంతా మీ వదిన చేసిన పని"

చెల్లెమ్మ మళ్లీ తల వంచుకొనింది.

"జరిగిందంతా మణుసులో పెట్టుకోని నువ్వు నోరు జారితే మల్లా నేను ఊళ్లో అడుగు పెట్టాల్సిన పనేలేదు. ఈ ఊళ్లోనే ఏబాయో గుంటో చూసుకుంటా"

మళ్లీ ఒకసారి తలపైకెత్తి అన్న మొగంలోకి చూసింది చెల్లెమ్మ. ఆమె కండ్లల్లో నీళ్లు తిరిగాయి. అయినా తమాయించుకొనింది.

"ఆ పిల్లగాడి మెడలో గొలుసు నేను తాకలేదంటే తాకలేదని నువ్వు గట్టిగా చెప్తే చాలు. మిగతా కతంతా నేను నడిపిస్తా."

ఆమె తల వాలిపోయింది.

మెల్లగా చేతులు విడిపించుకొనింది. అడుగు మీద అడుగ్గా వంట ఇంట్లోకి నడిచింది. చెంబుతో దాహానికి నీళ్లు తెచ్చి అన్న చేతికిచ్చింది.

అంకిరెడ్డి గుండె కుదుట పడింది.

రచ్చబండ వద్ద ఆరాత్రి జరుగుతున్న మద్దిస్తాన్ని గురించి రకరకాలుగా ఆలోచించుకుంటూ ఉంటే ఆ ఇంట్లో అంకిరెడ్డికి క్షణం ఒక యుగంగా గడుస్తూ ఉంది.

"రెడ్డయ్యా! పెద్ద మణుసులంతా రచ్చబండ కాడికొచ్చేసినారు" అని జాము రాత్రప్పుడు మడివేలు చెంగయ్య ఎలుగు ఇవ్వడంతో అంకిరెడ్డి ఈలోకంలో పడ్డాడు. చెల్లెమ్మను వెంటబెట్టుకొని రచ్చబండ వద్దకు బయలుదేరాడు. వాళ్లు రచ్చబండను చేరుకొనే సరికి అక్కడ అప్పటికే కోలాహలంగా ఉంది.

ఆరు సవరాల బంగారు గొలుసు పోగొట్టుకున్న ఇల్లు మాకడిని ఆపూట బంగారు కొండలా చూసుకొనింది. వాడు అతిథి మర్యాదలతో ఉక్కిరిబిక్కిరవుతుంటే తీసుకొని వచ్చి రచ్చబండ వద్ద నిలబెట్టారు.

పున్నమి నాటి ముందురోజు పండు వెన్నెల రాగి మాని ఆకుల సందుల్లో నుంచి పొడలు పొడలుగా రచ్చబండ మీద కూర్చున్న మనుషుల మీద పడుతూ ఉంది.

"ఎంత నంగనాచి టంగు బుర్రమ్మా? నోట్లో ఏలుపెడితే కొరికి తిందా అనిపిస్తా ఉండె. అయినా ఎంత పని చేసిందమ్మా?"

"కర్చే కుక్కలు ఎప్పుడూ మొరగవు."

"పోనీ కూటికి లేదా? గుడ్డకు లేదా? అంత కక్కుర్తి పడేదానికి!"

"మంచోడి బుద్ధి మాంసం కాడ తెలిస్తిందన్నెట్లుగా ఆ పాడు దుడ్లుండాయే అవి అంతే. మణిసిని ఏ కాడికైనా వగ దెగిపిస్తాయి."

"అవును. శాస్త్రాలు చూపించిరి. చెప్పు సగిణాలు చెయ్‌పించిరి. దాని మింద ఎప్పుడూ గుమాను పల్లేదే?"

"అప్పుడాపిల్ల ఊళ్లో యాడుండె. పుట్టింటికి పొయ్యుండ్లా. లావు మింద హొంపు తెల్దని దాని మింద ఎవరూ గుమానుపల్లా."

"అది సరే! ఊళ్లో పేడ ముద్దల తంతు కూడా జరిపించిరి గదా! ఇంటింటికి ఒక పేడ ముద్దను కూడా తెమ్మనిరి కదా! అప్పుడైనా ఆ పేడ ముద్దలో తెచ్చి పారేసి ఉంటే?"

"అదెప్పుడో చేతులు మారి అన్న ఇంటికి చేరిపోతే?.... - నువ్వు చెప్పేది బలే బాగుండాదే అది పేడ ముద్దలోకి ఎట్లొస్తింది?"

మద్దిస్తంలో ఏమి తేలుతుందో విందామని ఇంటి వాకిట గడపల్లో కూర్చున్న ఆడంగులు తలకొక విధంగా మాట్లాడుతున్నారు.

"ఏమిరా మాకా? ఏమి చెప్తావో చెప్పరా?" అని పినపెద్ద నోరువిప్పడంతో సద్దుమణిగింది.

"చెప్పేదానికి ఇంకే ముండాదయ్యా? చెప్పాల్సింది నేనెప్పుడో చెప్పేసినా. నా ఒక్క బిడ్డ సాచ్చిగా చెప్తా ఉండా. నాలుగు పేట గొలుసు తెచ్చి నాకండ్ల ముందర్నే ఆమె అన్న చేతికిచ్చింది"

"అవును. ఇది జరిగి ఐదారేండ్లు అయిపాయ గదా! ఇన్ని దినాలుగా నువ్వెందుకు చెప్పలా?"

"అది దొంగ సొత్తని నాకు మాత్రం ఎట్ల తెలుసయ్యా? అప్పచెల్లె తెచ్చి అన్నదమ్ముడికి ఇస్తా ఉండాదనుకుంటి. నిన్నగాక మొన్న కూతుర్ని కొడుక్కు చేసుకుంటానని చెప్పి చేసుకోలేదని, కట్నంగా ఇచ్చిన గొలుసు అడిగితే లేదన్నాడని ఈదిలో పాడి పాడి ఏడస్తా- 'ఒకర్ని నేను గెబీమనిపిస్తే దేవుడు నన్ను గెబీమనిపించె' అంటా ఉంటే గదా అసలు కత అర్తమాయ"

"నువ్వే మంటావ్ అంకిరెడ్డీ!"

"ఆ తక్కువ జాతోడి మాటలు మీరు నమ్మతా ఉండారా?"

"వాడు నీ ఇంట్లో సేద్యగాడుగా ఉండె గదబ్బా?"

"ఉండె. ఇప్పుడు నా తలకాడ గుండాయ. సేద్యానికి వద్దన్నానని వాడు కతలల్లి చెప్తా ఉంటే మీరు నమ్మతాఉండారు. అప్పిటికి మీరంతా అనేది దానికి కూటికి లేదని, గుడ్డకు లేదని, ఇట్టా కక్కుర్తి పడిందని! దొంగతనం చేసి బతకాల్సిన కర్మ దానికేం బట్టింది? పోనీ, చేసి దాన్ని తెచ్చి నాచేతికియ్యాల్సిన అగత్తెం ఎందుకు కలిగింది?"

"మాకడట్టా, అంకిరెడ్డి ఇట్టా? ఇంకెట్ట చెయ్యాలబ్బా?"

"ఎట్ట చెయ్యాలబ్బా అంటే? పోలీసు కంప్లీటు ఇచ్చేస్తే కట్టె హొంపు పొయ్యి

తీర్చినట్టయితింది" ఒక పెద్ద తల సలహా ఇచ్చింది.

"అయితిందబ్బా అయితింది. దానివల్ల ఎవుడికేమి లాబం? అట్లనుకుంటే ఇంక ఊళ్లెందుకు? ఊళ్లల్లో ఈమద్దిస్తాలెందుకు? పోలీసు కంప్లీటంటే ఇంట్లో పుండెత్తి ఈదిలో పెట్నెట్టే కదా! ఈళ్లు పనీ పాటా వొదులుకోని టేసిన్ చుట్టూ తిరగాల. తిరిగి తిరిగి ఈళ్లకు బతుకు చావుజంపులు గావాల. అప్పుడు పోలీసోళ్లే ఆ నగను మట్టసంగా చుట్టుకోవాల" పినపెద్ద ఆ సలహాను తిప్పికొట్టాడు.

"అయితే ఇప్పుడేం చెయ్యాల?"

"ప్రెమాణం చెయ్‌పిస్తే?"

"ఎక్కడ చెయ్‌మనాల?"

"ఆడా ఈడా ఎందుకు? కాణిపాకం యినాయికుడుండాడు గదా ఆ గుళ్లో చెయ్‌పిస్తే ఇంక దానికి తిరుగు మరుగు ఉండదు. కోరట్లో గూడా అప్పీలుండదు."

"అయితే ఎవురు ప్రెమాణం చెయ్యాల?"

"ఎవురు చెయ్యాలంటే?...పిలగాడి మెళ్లో గొలుసు నేను తీసుకోలేదని ఆ అమ్మి ప్రెమాణం చెయ్యాల"

"మాకేం గాచ్చారం పట్టిందయ్యా ప్రెమాణం చేసేదానికి? వాడెవుడో దారిన పొయ్యే నా కొడుకు మా మింద నింద మోపితే మేము దానికి సత్తె ప్రమాణాలు చెయ్యాల్నా? ఏమి నాయమయ్యా మీ నాయం? అట్టయితే మా చెల్లి గొలుసు దొంగిలించిందని వాళ్లనే ప్రెమాణం చెయ్యమనండి."

"ఇది మరీ బాగుండాదే? మీ చెల్లె గొలుసు కొట్టేసిందని మేమేమన్నా కలగన్నామా? కండ్లారా చూసినామా? మాకడు మాతో చెప్తే తెలిసె. మేముపాలన్నం తినే పదిమంది పెద్ద మణుసులకు చెప్తా ఉండాం. నువ్వు మాట్లాడేది నాయం కాదు అంకిరెడ్డీ!"

"వాళ్లట్టా, మీరిట్టా? ఇంకెవురు చెయ్యాలబ్బా?"

"ఎవరు చెయ్యాలంటే మాకడే చెయ్యాల!"

"ఏమిరా మాకా?"

"నాకేం అబ్బెంతరం లేదయ్యా? మీరు యాడ చెయ్యమంటే ఆడ చేస్తా"

"ఒరే కుండాకోర్ నా కొడకా! యాడికి తెగించినావురా. మా చెల్లి దొంగతనం చేసింది నువ్వు చూసినావురా?"

"రెడ్డయ్యా! ఇది ఊరు. పదిమంది పెద్ద మణుసుల ముందర ఇష్టమొచ్చినట్టు నోరు పారేసుకోబాక. మీ చెల్లెమ్మ దొంగతనం చేసిందో లేదో నాకు తెల్దు. ఆ గొలుసు మాత్రం నీ ఇల్లు చేరింది. నన్ను యాడ ప్రెమాణం చెయ్యమంటే ఆడ చేస్తా."

"రే! ఏం కూసినావురా?"

"అంకిరెడ్డీ! మీరిద్దరే వాదులాడుకుంటానంటే నడిమిద్దె పెద్ద మణుసులు

ఎందుకయ్యా?"

"లేకుంటే చూడండి!"

"నువ్వు వాడికెందుకు నోరిస్తావే? మేం ఉండాం గదా!"

"మీతో ఏం మాట్లాడమంటారు? మాట్లాడితే ప్రెమాణం చెయ్యమంటారు"

"అంతేగదా? చేస్తే నువ్వయినా చెయ్యాల. లేకపోతే వాడైనా చెయ్యాల"

"వాడికేం? అన్నిటికీ ఇడ్సేసినోడు. ఏం చెయ్యమన్నా చేస్తాడు."

"నువ్వు చెప్పేది బలే బాగుండాదే? వాడికేం పెండ్లాం బిడ్డలు లేరా? బతుకు మింద ఆశ లేదా? కాణిపాకం యినాయకుడి గుడికాడ ప్రెమాణం చేసేదంటే సటపటమైన పనా? చెప్పు. నువ్వు చేస్తావా, వాణ్ణి చెయ్యమంటావా?"

పరిస్థితి కాణిపాకం వినాయకుడి గుడి వరకు వస్తుందని ఊహించని అంకిరెడ్డి ఎటూ చెప్పలేక నీళ్లు నములుతున్నాడు. ప్రెమాణం చేస్తే ఎలా? చేయకపోతే ఎలా? అని తనలో తాను మల్లగుల్లాలు పడ్తున్నాడు.

"తప్పు చేసినోడేనయ్యా ఆలోచిస్తాడు. లేనోడు ఎందుకాలోచిస్తాడు?"

ఎవరో కొట్టాల్సిన చోటనే కొట్టే అది తగలాల్సినచోటనే తగిలింది.

"అవునవునయ్యా! నేను తప్పు చేసినాను. ఆతక్కవ జాతోడిని అడ్డం పెట్టుకోని మీరు నన్ను ఆట పట్టించాలని చూస్తా ఉండారు"

"అంకిరెడ్డీ! అడ్డం పెట్టుకుండేదేంది, ఆట పట్టించేదేంది? అప్పిటికి వాడు మాకు బొడ్డు కింద చుట్టం, నువ్వు కాదో? అదెంతా కాదు. నాయం ఎట్టుంటే అట్నే. మాకడు కాణిపాకం యినాయకుడి గుళ్లో ప్రెమాణం చేస్తాడు. నువ్వు వాళ్ల సొత్తు వాళ్లకు ఇచ్చేయాల్సిందే. ఏమిరా మాకా?"

"నేను ఈ పొద్దయినా రెడీ! రేపైనా రెడీ...మీరెప్పుడు చెప్తే అప్పుడు"

"ఒరే, తక్కవ జాతోడా! చెయ్‌రా! ప్రెమాణం చెయ్. అబం సుబం ఎరగనోడి మింద అపనింద మోపతా ఉండావ్. ఇంత అన్నాయానికి దిగినోణ్ణి ఆ కాణిపాకం యినాయకుడే చూసుకుంటాడు. ఆ దేముళ్లో సత్తెముంటే నేను చెప్తా ఉండా యిను. ఆ దేముడి ముందరే నువ్వు రగతం కక్కి చావకపోతే..."

"అంకిరెడ్డీ! ఎందుకట్లా నోరు పారేసుకుంటావే! ఉప్పు తిన్నోడు నీళ్లు తాగాల్సిందే. తప్పదు. తప్పుచేసినోడు తప్పకుండా అనబవిస్తాడు. ఈ పొద్దు ఏవారం ఆదివారం కదా. పైవొచ్చే ఆదివారం మాకడు కాణిపాకం యినాయకుడి గుళ్లో ప్రెమాణం చేస్తాడు. నువ్వు వాళ్ల సొత్తు వాళ్ల కిచ్చేయాల్సిందే. ఇది పదిమంది పాలన్నం తినే పెద్దమణుసుల తీర్మానం...!"

పినపెద్ద తీర్పు చెప్పాడు. సాధారణంగా ఆతీర్పుకు మార్పు ఉండదు. అప్పటికే చుక్క నడిమిట్టకొచ్చింది. 'శానా రేత్రి అయ్‌పొయ్యిందే' అనుకుంటా ఎవరి దారిన వాళ్లు

ఇల్లు చేరారు.

ఆ రాత్రి అంకిరెడ్డికి కంటిమీద రెప్ప పడితే ఒట్టు....

*　　　*　　　*　　　*

తెల్లారింది. అలానే ప్రతిరోజు తెల్లారింది. అయితే, గురువారం తెల్లారేసరికి ఊరు గుప్పుమనింది.

మాకడు కాణిపాకం వినాయకుడి గుడి ముందు రక్తం కక్కి చచ్చిపడి ఉన్నాడట!

“చూసినారా! చూసినారా! నా మింద నింద మోపితే వాడి గతి ఏమయిందో చూసినారా? కాణిపాకం యినాయకుడంటే ఏమనుకుణ్ణారు? మహన్నబావుడికి ఎవుర్నెట్టా శిచ్చించాల్నో బాగా తెలుసు. ఆతక్కువ జాతోడిని అడ్డంపెట్టుకొని నన్నొక ఆట పట్టించాలనుకుంటే బగమంతుడు వోరస్తాడా?”

అంకిరెడ్డి నిలిచిన చోట నిలబడకుండా ఊరంతా తిరిగి ఎలుగెత్తి చాటుతున్నాడు.

నిజం నెత్తురు కక్కి చావడానికి ఎవరు సాక్షి?

కాణిపాకం వినాయకుడి సాక్షిగా జరిగిపోయిన అమానుషానికి మాటవుండీ లేని వాడే సాక్షి ●

*- ఇండియాటుడే (ఏప్రిల్ 1995)*